RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**పదేళ్లలో ప్రజల్లోకెళ్లని కేటీఆర్**

ఇప్పుడు పాదయాత్ర ఏంటీ..

కవిత సంచలన వ్యాఖ్యలు

2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 88 | ఏప్రిల్ 18 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 88 | April 18 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## మీ అంతరాత్మ చెప్పినట్లు

# ఓటు వేయండి

- ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు)కు సంపూర్ణ మద్దతు తెలపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంపీలకు పిలుపునిచ్చారు. పార్లమెంటు సభ్యులందరూ రాజకీయాలకు అతీతంగా, తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి, వారిని నిర్ణయాత్మక ప్రక్రియలో భాగస్వాములను చేయడానికి ఇదొక చారిత్రాత్మక అవకాశమని ప్రధాని పేర్కొన్నారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ, "మీ ఇంట్లోని తల్లి, సోదరి, కుమార్తె, భార్యను గుర్తుంచుకుని, మీ అంతరాత్మ చెప్పినట్లు ఓటు వేయండి. ఈ సవరణ

➤ మిగతా 2వ పేజిలో..

## 2023లో ఆమోదం పొందిన

# బిల్లునే ఆమోదించాలి

- అది సాధ్యం కాకపోతే కొత్తగా మరో బిల్లును తీసుకురావాలి
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధి



**న్యూఢిల్లీజన సంఘర్షణ**
2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లును వెంటనే అమలు చేయాలని, ఒకవేళ అది సాధ్యం కాకపోతే కొత్తగా మరో బిల్లును తీసుకురావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో పలు రాజ్యాంగ సవరణలు మరియు డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళా సాధికారత కోసం ఉద్దేశించినది కాదని, కేవలం దాని ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బీసీ, దళిత, మైనార్టీ వర్గాల పట్ల, అలాగే మహిళల పట్ల ఈ బిల్లు క్రూరమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా, ఓబీసీల నుంచి అధికారాన్ని

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ బంగారం పైపైకి..

మూడు రోజులుగా పెరగటమే..



**ముంబై జన సంఘర్షణ**
భారతదేశంలో బంగారం ధరలు గత మూడు రోజులుగా నిరంతరాయంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితి నేపథ్యంలో సురక్షిత పెట్టుబడిగా బంగారంపై ఆసక్తి పెరగడం, అక్షయ తృతీయ సమీపిస్తుండటంతో పెరిగిన డిమాండ్ వెరసి పసిడి ధరలు

➤ మిగతా 2వ పేజిలో..

## వేర్వేరు ప్రమాదాల్లో

# పది మంది మృతి

**చెన్నై జన సంఘర్షణ**
తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా, వాల్పరై ఘాట్ రోడ్డులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న వ్యాన్ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వ్యాన్ పైనుంచి కిందపడటంతో అది పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఇందులో ప్రయాణిస్తున్న పది మంది అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మరికొందరిని రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో జరిగిన మరో ప్రమాదం అత్యంత దారుణంగా ముగిసింది. హైవేపై వేగంగా వెళ్తున్న కారు టైర్ ఒక్కసారిగా పేలిపోవడంతో, కారు

➤ మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరంఎటువంటి

# దురుద్దేశాలు లేదు

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ జన సంఘర్షణ**
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వానికి ఎటువంటి దురుద్దేశాలు లేవని, ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తూ బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (చీఐూా) చైర్మన్ అనిల్ జైన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనులపై క్షుణ్ణంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజీని స్వయంగా పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు. వచ్చే వానాకాలం వరదలు రాకముందే సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను, అలాగే అవసరమైన డిజైన్ల రూపకల్పనను పూర్తి చేయడమే

➤ మిగతా 2వ పేజిలో..

# మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

## ఢిల్లీలో కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ జన సంఘర్షణ**
తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు, పెండింగ్ నిధుల విడుదలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కీలక విజ్ఞప్తులు చేశారు. రాబోయే 2025-26 వానాకాలం మరియు యాసంగి సీజన్లకు సంబంధించి, రాష్ట్రంలో పండబోయే ధాన్యం సేకరణపై కేంద్రం మద్దతు కోరారు. ముఖ్యంగా, ఈ రబీ సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందులో 30 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పుడు బియ్యం (పార్‌బాయిల్డ్ రైస్)ను భారత ఆహార సంస్థ ద్వారా సేకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని వారు

➤ మిగతా 2వ పేజిలో..



## కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడమే ఉద్దేశం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


2

# 2023లో ఆమోదం పొందిన బిల్లునే ఆమోదించాలి

**మొదటిపేజీ తరువాయి..** లాక్కునే కుట్ర జరుగుతోందని, కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కీలకమైన న్యాయ వ్యవస్థ, ప్రైవేటు రంగం, మరియు దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో ఓబీసీలు, దళితుల ప్రాతినిధ్యంపై రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఓబీసీలకు భాగస్వామ్యం కల్పించేందుకు బీజేపీ సిద్ధంగా లేదని, దక్షిణాది మరియు ఈశాన్య రాష్ట్రాలను కూడా ఆ పార్టీ గౌరవించడం లేదని విమర్శించారు.

ఈ చర్చ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. మోదీని పరోక్షంగా 'మెజీషియన్' (ఇంద్రజాలికుడు) అని సంబోధించడమే కాకుండా, బాలాకోట్, డీమోనిటైజేషన్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ తీరుపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిరణ్ రిజిజులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని, దేశాన్ని, మిలటరీని అవమానించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రులు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను రికార్డుల నుండి తొలగించాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరగా, స్పీకర్ ఓం బిర్లా అందుకు అంగీకరించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆరోపించారు.

# మీ అంతరాత్మ చెప్పినట్లు ఓటు వేయండి

**మొదటిపేజీ తరువాయి..** ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుపై పార్లమెంటులో సుదీర్ఘంగా చర్చ జరిగిందని, సభ్యుల సందేహాలను, అపోహలను ప్రభుత్వం నివృత్తి చేసిందని ప్రధాని గుర్తు చేశారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయాలకు అతీతంగా పెండింగ్‌లో ఉందని, ఇప్పటికైనా మహిళలకు వారి హక్కులు కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని ఏళ్ల తర్వాత కూడా పాలనాపరమైన నిర్ణయాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు సాధికారత కల్పించేందుకు, వారి మనోభావాలను దెబ్బతీయకుండా సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి చరిత్ర సృష్టించేందుకు సహకరించాలని ప్రధాని మోదీ అన్ని రాజకీయ పార్టీలను కోరారు.

# వేర్వేరు ప్రమాదాల్లో పది మంది మృతి

**మొదటిపేజీ తరువాయి..** అదుపు తప్పి ముందు వెళ్తున్న బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో మంటలు చెలరేగి, క్షణాల్లో కారుకు కూడా వ్యాపించాయి. ఈ మంటల్లో కారు పూర్తిగా దగ్ధమవ్వడమే కాకుండా, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు సజీవ దహనమయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వరుస ప్రమాదాల కారణంగా ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మళ్లీ బంగారం పైపైకి..

**మొదటిపేజీ తరువాయి..** గత మూడు రోజుల్లోనే సుమారు రూ. 3,000 మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,55,580గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,42,610గా నమోదైంది. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ. 2,74,900 వద్ద దాదాపు స్థిరంగా కొనసాగుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోని ధరలను గమనిస్తే, చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,56,670గా, ముంబైలో రూ. 1,55,580గా, మరియు న్యూఢిల్లీలో రూ. 1,55,730గా ఉన్నాయి. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర చెన్నైలో రూ. 1,43,610, ముంబైలో రూ. 1,42,610, మరియు న్యూఢిల్లీలో రూ. 1,42,760 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ. 2.69 లక్షల నుండి రూ. 2.74 లక్షల మధ్య కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,787 డాలర్లుగా, ఔన్స్ వెండి ధర 78 డాలర్లుగా నమోదైంది.

# మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మొదటిపేజీ తరువాయి.. విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో దేశంలోనే అత్యధికంగా వరి ధాన్యం ఉత్పత్తి జరుగుతోందని, రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 48 గంటల్లోనే మద్దతు ధరను వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 1,400 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. అలాగే, కేంద్రం రద్దు చేసిన పోషకాహార పంపిణీ పథకంపై కూడా తమ అసమ్మతిని వ్యక్తం చేశారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులను కలవడమే కాకుండా, దక్షిణాది రాష్ట్రాల గొంతుకగా నిలుస్తూ డీలిమిటేషన్ అంశంపై 'హైబ్రిడ్ మోడల్' కోసం జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ప్రోరేటా పద్ధతిని వ్యతిరేకిస్తూ దక్షిణాది ముఖ్యమంత్రులతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

# కాళేశ్వరంఎటువంటి దురుద్దేశాలు లేదు

**మొదటిపేజీ తరువాయి..** తమ ముందున్న తక్షణ లక్ష్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వైఫల్యాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సుమారు రూ. 97 వేల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు ఈ విధంగా కుంగిపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలకు సంబంధించి ఏటా రూ. 10 వేల కోట్ల వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే పనులు చేపడుతున్నామని, మేడిగడ్డ మరమ్మతులకు సంబంధించి సాయిల్ టెస్టులు, డిజైన్ల ఖర్చులను సదరు కాంట్రాక్ట్ సంస్థలే భరించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## బిజెపి ఎంపిలకు విప్ జారీ

**ఢిల్లీలోనే ఉండాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుపై కౌంటింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీలకు మూడు లైన్ల విప్ జారీ చేసింది పార్టీ అధిష్ఠానం. ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ విప్ ద్వారా బెంగాల్, తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉన్న సభ్యులను కూడా ఢిల్లీకి రప్పించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కీలక బిల్లుల ఆమోదం కోసం హైకమాండ్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. బీజేపీ ఎంపీలందరూ తప్పనిసరిగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు హాజరుకావాలని 'త్రీ-లైన్ విప్'లో పేర్కొంది హైకమాండ్. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉన్నందున.. సభ్యులంతా సభకు హాజరై ప్రభుత్వానికి మద్దతు తెలపాలంది. కేంద్ర మంత్రులతో సహా ఎంపీలందరూ సభలోనే ఉండాలని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేసింది.

## మద్యం కేసులో వాసుదేవరెడ్డికి బెయిల్

**విజయవాడ, ఏప్రిల్17 :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2 నిందితుడు వాసుదేవ రెడ్డికి ఏసీబీ కోర్టు శుక్రవారం)బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2, 4 సోమవారాల్లో విచారణ అధికారుల ఎదుట హాజరవ్వాలని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది. ఇదే కేసులో మరో ముగ్గురు నిందితులు ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్ రెడ్డిల రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసింది. ఈ తీర్పును ఏప్రిల్ 24వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.

## తేజస్వీ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సీరియస్

**ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్17 :** బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ

## పదేళ్లలో ప్రజల్లోకెళ్లని కేటీఆర్

**ఇప్పుడు పాదయాత్ర ఏంటీ..**

**కవిత సంచలన వ్యాఖ్యలు**

**హైదారాబాద్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రజల్లోకి వెళ్లని మాజీ మంత్రి కేటీఆర్, ఇప్పుడు హఠాత్తుగా పాదయాత్ర చేస్తానని అనడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పదేళ్ల అధికార కాలంలో ప్రజలకు అందుబాటులో లేని వారు, ఇప్పుడు పాదయాత్ర ద్వారా ఏం సాధిస్తారని కవిత నిలదీశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తామని, అదే సమయంలో బీఆర్ఎస్ వైఫల్యాలపై కూడా తాను గొంతు విప్పుతానని ఆమె స్పష్టం చేశారు.

పరిగిలో రైతు దీక్షకు వెళ్లకుండా హరీశ్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంపై స్పందిస్తూ, అధికార పార్టీ తీరును ఆమె విమర్శించారు. తాను కూడా రైతులకు మద్దతుగా పరిగి వెళ్లినప్పుడు పోలీసులు అరెస్టు చేశారని, ఏ పరిస్థితులు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాటం ఆపేది లేదని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్నదే తన లక్ష్యమని, సర్వోదయ తెలంగాణ సాధన కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ లక్ష్య సాధనలో తనకు మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి సంస్థల మద్దతు లభించడం గొప్ప శక్తినిచ్చిందని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిందని గుర్తు చేసిన కవిత, భవిష్యత్తులో తాను కొత్త పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నట్లు సంకేతాలిచ్చారు. తనను కలిసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల వివరాలను బయటపెట్టని ఆమె, ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ సామాజిక తెలంగాణ కోసం పోరాడుతానని వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణం విజయవంతం కావాలని కోరుకుంటూనే, తనపై ఉన్న ఆరోపణలు, ఇబ్బందులు తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు ఆమె వివరించారు. తాను తలపెట్టిన కార్యం దిగ్విజయంగా పూర్తవుతుందనే నమ్మకాన్ని కవిత వ్యక్తం చేశారు.

## కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడమే ఉద్దేశం

**కేంద్ర మంత్రి కేషన్ రెడ్డి**

**హైదారాబాద్**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) మరియు మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండానే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని, కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అయితే, రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిస్తున్న 'హైబ్రిడ్ ఫార్ములా'ను కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. అది రేవంత్ రెడ్డి ఫార్ములా కాదని, అసదుద్దీన్ ఒవైసీ ఫార్ములా అని ఆయన ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు ఎంఐఎం పార్టీ వ్యతిరేకమని, ఆ పార్టీ ప్రభావంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయిందని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని, దీనిపై చర్చకు తాము సిద్ధమని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఖరిని, పార్లమెంటులో విభజన బిల్లు సమయంలో ఆ పార్టీ ఎంపీలు వ్యవహరించిన తీరును ఆయన గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ మరియు నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునే వారు చరిత్రలో నిలిచిపోరని, ఇటువంటి చారిత్రక బిల్లులను అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్షాలు ప్రజల ముందు దోషులుగా మిగిలిపోతాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

## రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

**కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన**

**న్యూఢిల్లీ, ఏప్రిల్17 :** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


# 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగముగా

- ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు త్వరితగతిన అట్టి వ్యక్తిని కాపాడడానికి సిపిఆర్ ఎంతో ఉపయోగపడుతుంది పోలీస్ కమిషనర్ వెల్లడి
- జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణ
- ప్రతి ఒక్కరూ సిపిఆర్ పద్ధతి అవగాహన కలిగి ఉండవలెను






**బోధన్: ఏప్రిల్ 17 జన సంఘర్షణ**
రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించడం ప్రజలలో ట్రాఫిక్ నియమాలు పట్ల బాధ్యత భావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు . ఇందులో భాగముగా శుక్రవారం ఐదవ రోజున నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ యందు బ్లూ కోర్టు సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు సిపిఆర్ పద్ధతి పై అవగాహన కార్యక్రమం నిర్వహించగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.... అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రాణరక్షణకు సంబంధించిన అత్యవసర నైపుణ్యాలపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు వంటి ప్రజలతో నిత్యం సంబంధం కలిగిన వర్గాలు తప్పనిసరిగా విధానం గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించడంలో సిపిఆర్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. అయితే సమాజంలో ఇంకా చాలామందికి ఈ పద్ధతి పై సరైన అవగాహన లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ శిక్షణలో సిపిఆర్ విధానం , ప్రాథమిక ప్రథమ చికిత్స అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి వంటి అంశాలను నిపుణుల ద్వారా వివరించనున్నారు. ప్రతి పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు కూడా ఈ శిక్షణలో పాల్గొని అవగాహన పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమయానికి సరైన సహాయం అందిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని, అందుకు సిపిఆర్ వంటి నైపుణ్యాలు ప్రతి ఒక్కరికీ అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో భద్రతా చైతన్యం పెంపొందించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన సామర్థ్యాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి, నిజామాబాద్ ట్రాఫిక్ ఏ.సీ.పి మస్తాన్ అలీ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం , ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ వినోద్, డాక్టర్ విశాల్ (ఐ.ఎమ్.ఏ ప్రెసిడెంట్, డాక్టర్ రామనేశ్వర్ ( న్యూరాలజిస్ట్, ( ఐ.ఎమ్.ఏ ట్రెజరీ ), డాక్టర్ శ్రీశైలం (పీడియాట్రిస్ట్, డాక్టర్ విట్టల్ అనస్తేషియా స్పెషలిస్ట్, ఐటీ కోర్స్ సిబ్బంది, బ్లూ కోర్ట్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన భద్రత - మన బాధ్యత

- పోలీస్ కమిషనర్ వెల్లడి.



**నిజామాబాద్ : ఏప్రిల్ 17 జన సంఘర్షణ**
అరైవ్ అలైవ్ - 2026"లో రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై కార్పొరేటర్స్‌కు, గ్రామ సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహణ. జిల్లాలోని ప్రజలందరూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు అందరూ హెల్మెట్ ధరిస్తే జిల్లా వ్యాప్తంగా అందరిని ఐపిఎల్ మ్యాచ్ ఉచితంగా చూపిస్తాము. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాదు డివిజన్ పరిధిలో కొత్తగా ఎన్నికైనటువంటి కార్పొరేటర్స్, గ్రామ సర్పంచులు లతో మన ఊరు - మన భద్రత - మన బాధ్యత అనే కార్యక్రమాన్ని నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాదులోని శ్రీ రామ గార్డెన్స్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ హాజరయ్యారు. ఈ సందర్భముగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు అరేవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా నిర్వహించాలనేటువంటి ఉద్దేశంతో నిర్వహించారు. ప్రపంచంలో ఒక్క యాక్సిడెంట్ జరుగకుండా ఉన్న దేశం ప్రస్తుతం ఫిన్లాండ్ దేశం అని అన్నారు. వ్యవసాయాదరులు రోడ్డు పై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకం నిషేధం అని, ప్రతిఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూడాలని, యువత డ్రగ్స్ కు బానిస కాకుండా ప్రతీ ఒక్కరు వారిని గమనిస్తూ ఉండాలని, ఆన్లైన్ బెట్టింగ్ కు దూరంగా ఉండాలని , రోడ్డు భద్రతా నియమాలు , ట్రాఫిక్ నిబంధనలు , డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం , క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారి తీస్తాయని వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ, ట్రాఫిక్ నియమాల కట్టుదిట్టమైన పద్ధతుల ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో అవగాహన పెరిగి, రోడ్డు ప్రమాదాల నివారణకు , డ్రగ్స్ మీద యువతకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు అందరూ హెల్మెట్ ధరిస్తే జిల్లా వ్యాప్తంగా అందరిని ఐపిఎల్ మ్యాచ్ ఉచితంగా చూపిస్తాము అని అన్నారు. నిజామాబాదు డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులు వచ్చి మాట్లాడటం జరిగింది. ప్రధానంగా రోడ్డు ప్రమాదంలో మరణించిన మాక్లూరు మండలానికి చెందినటువంటి వ్యక్తి మరణించిన సందర్భంగా అతని కుటుంబంలో చాలా నిరుపేదగా ఉండటం వలన వారి కుటుంబ సభ్యురాలు ఆయన పుష్ప కు అప్పుడే జమ చేసిన డబ్బులను పోలీస్ కమిషనర్ చేతుల ద్వారా అందించారు. ఆ తరువాత అరైవ్ అలైవ్ సంబందించిన ప్రతిజ్ఞ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నిజామాబాదు ఇంచార్జి ఎసిపి రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, సర్పంచ్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు చిన్న సాయిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిఐలు, ఎస్సైలు, యాంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ పుర్ణేశ్వర్, సైబర్ క్రైమ్ ఆర్.ఎస్. ఐ రవి, గ్రామ సర్పంచ్‌లు, కార్పొరేటర్స్, ప్రజలు, పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

# పెద్ద వాగు ప్రాజెక్ట్ పున నిర్మాణం చేపట్టాలి

- సిపిఐ పాదయాత్రలో జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా
- అశ్వారావుపేట పెద్దవాగు ప్రాజెక్టు పున నిర్మాణంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలు విఫలం
- 98 కోట్లతో ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేపట్టలేరా?
- తెలంగాణ మంత్రులు తుమ్మల -పొంగులేటి రైతులకు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలేనా?




**17-4-2026 జన సంఘర్షణ**
సిపిఐ ఆధ్వర్యంలో పెద్దవాగు ప్రాజెక్టు నుంచి వేలేరుపాడ్ వరకు పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ సిపిఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ,సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబిర్ పాషా-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ డి సలీం నరాటి ప్రసాద్, కారం ధారయ, బాడిశ రాము, పిట్టా ప్రసాద్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, ఎస్.కె సాబీర్ పాషా మాట్లాడుతూ.. పెద్దవాగు ప్రాజెక్ట్ వరదకు కొట్టకు పోయి దాదాపు రెండు ఏళ్ళు అవుతున్న నేటివరకు ప్రాజెక్టు పుననిర్మాణం చేపట్టలేక పోవటం అంటే ప్రభుత్వం వైఫల్యం చెందినది అని ఈశ్వరయ్య అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్టు 82 శాతం ఆంధ్రప్రదేశ్ రైతులకు తెలంగాణ రైతులకు 18 శాతం ఆయకట్టు ఉన్నది అని ప్రాజెక్ట్ పుననిర్మాణం కోసం 92 కోట్లు ఎస్టిమేషన్ చేసి నిధులు మంజూరి చెయ్యకుండా నిద్రపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయడు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు గిరిజన రైతులకు సాగునీరు అందించటం కోసం నిధులు మంజూరి చెయ్యరా అని ప్రశ్నించారు. రెండు ఏళ్ళు నుండి పంటలు సాగు చెయ్యక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కట్ట తెగిపోతే తెలంగాణ ప్రభుత్వం రింగు బండ కోసం 3 కోట్ల పై చిలుకు ఖర్చు పెట్టినా నిరుపయోగం చేసి చేతులు దులుపుకున్నారు అని, తక్షణమే 92 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి అని, కొత్తగా 5లాక్స్ ఏర్పాటు చెయ్యాలి అని అన్నారు. శుక్రవారం పెద్దవాగు ప్రాజెక్ట్ నుండి వేలేరుపాడు వరకు వేయి మంది భారీ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభం చెయ్యాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## టిచర్ల అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**బోధన్ : ఏప్రిల్ 17**
బోధన్ పట్టణంలోని టీజీ ఈ జేఏసీ ఆధ్వర్యంలో గత కొద్ది కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా 51 శాతం ఫిట్మెంట్తో పిఆర్సి అమలు చేయాలని గత కొద్ది కాలంగా పెండింగ్లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డు వర్తింపచేయాలని సిపిఎస్ స్థానంలో ఓపిఎస్ వర్తింపజేయాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వమే మేము 57/457/5 ఆధారంగా 19 2004 ముందు నియమించబడిన ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీజీ ఈ జేఏసీ అధ్యక్షులు కార్తీక్ టిఆర్ఎస్ఎ బాధ్యులు విట్టల్ పిఆర్టియు నాయకులు శంకర్, థామస్, కైరాన్, ధన్రాజ్, గంగాధర్ బసవరాజ్ అభ్యేంధర్ సిటు నాయకులు నెమలి సంజీవ్, సలీం, వాహిద్ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రాజేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటేశం, టీ ఎన్ జి ఓ నాయకులు సాయిలు, శ్వేత, విమల, స్రవంతి, వివిధ సంఘ నాయకులు సుమారుగా 100 మంది పాల్గొని కార్యక్రమం నిరసన వ్యక్తంచేశారు.

## బిచ్కుంద రూ.2లక్షలు లంచం తీసుకుంటూ అరెస్ట్



**బోధన్ : ఏప్రిల్ 17జన సంఘర్షణ**
బిచ్కుంద ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. కల్లు దుకాణాల తరలింపుపై ఒత్తిడి చేయకుండా, కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుంచి ఈ మొత్తం డిమాండ్ చేశారు. అదనంగా ఆయన వద్ద రూ.45,760 నగదు లభించింది. ఏసీబీ అధికారులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండు తరలించారు.

## అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సభ్యులు అన్నదాన కార్యక్రమం..



**హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 17(జనసంఘర్షణ )**
అంబర్పేట్ నియోజకవర్గంలోని ప్రేమ్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమం గ్రీన్ ల్యాండ్ హోటల్ సమీపంలో శుక్రవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు జిల్లా రవీందర్, ప్రధాన కార్యదర్శి కూన అంజయ్య, కోశాధికారి ఆకుల రమేష్, అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షులు జూలూరు తిరుపతి, గుప్తా చైర్మన్ జిల్లా హరిబాబు, శరణమయ్య, జూలూరి భాస్కర్, ప్రభాకర్, భువనగిరి శ్రీనివాస్, మంచి కట్టి మహేష్, కాసుల గోవి, బెజగం శ్రీధర్, జై వాసవి జై వాసవి ఆర్య వైశ్య సభ్యులు పాల్గొన్నారు.

## సీనియర్ బిజెపి నేతలకు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శ



**హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 17( జనసంఘర్షణ )**
గాంధీనగర్ డివిజన్‌లో ఇటీవల మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు, డివిజన్ సీనియర్ నాయకులు వి ఎస్ టీ రాజు తండ్రి కె.మల్లయ్య స్వర్గస్తులైనారనిలి తెలుసుకొని మాజీ హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం విఎస్‌టీ రాజు నివాసానికి చేరుకొని ఆయన తండ్రి మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారితో పాటు మరో డివిజన్ మాజీ సీనియర్ నాయకుడు వున్న రాజమోహన్ సతీమణి వున్న మాదివి అకాల మరణం పట్ల రాజమోహన్ నివాసంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, వైద్యనాధ్, శ్రీకాంత్, పాల శ్రీనివాస్, ఎం.ఉమేష్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## నవ్వుతూ వెళ్ళిన ప్రాణం.. విషాదంలో వాకర్స్ క్లబ్

- ప్రకాష్‌కు అశ్రునివాళి!



**ఇల్లందు ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)**
పట్టణంలో అందరికీ సుపరిచితుడైన వ్యాపారి, పాన్ షాపు యజమాని ప్రకాష్ (52) హఠాన్మరణం ఇల్లందు వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రతిరోజూ లాగే గురువారం ఉదయం జేకే గ్రౌండ్‌లో ఉత్సాహంగా వాకింగ్ ముగించుకుని వస్తుండగా, ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆయన కుప్ప కూలిపోయారు. ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోవడంతో పాత బస్టాండ్ సెంటర్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇల్లందు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జేకే కాలనీలో సంతాప సభ నిర్వహించి, ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దంతాల ఆనంద్, సుదర్శన్ కోరి, డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ తదితరులు పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

**ఆరోగ్యం కోసం అడుగులేస్తూ.. అనంత లోకాలకు: సుదర్శన్ కోరి ఆవేదన**

"ప్రకాష్ మన మధ్య లేరనే వార్త నమ్మశక్యంగా లేదు. నిత్యం పలకరించే ఆ చిరునవ్వు, ఆత్మీయత ఇక కేవలం జ్ఞాపకమే. ఆరోగ్యం కోసం అడుగులు వేస్తూనే.. మృత్యువు ఒడిలోకి వెళ్లడం అత్యంత బాధాకరం. గుండెపోటు అనేది వయసుతో సంబంధం లేకుండా సైలెంట్ కిల్లర్‌లా మారుతోంది. ప్రకాష్ మరణం మనందరికీ ఒక హెచ్చరిక. పని ఒత్తిడిలో పడి ప్రాణాలను నిర్లక్ష్యం చేయవద్దు." అని సుదర్శన్ కోరి భావోద్వేగంతో పిలుపునిచ్చారు. వాకింగ్ చేస్తున్నాం కదా మనకు ఏమీ కాదు అన్న ధీమా కంటే, లోలోపల గుండె పనితీరు ఎలా ఉందో గమనించుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. వ్యాయామం ఎంత ముఖ్యమో, క్రమబద్ధమైన వైద్య పరీక్షలు కూడా అంతే ముఖ్యం. ప్రకాష్ మరణం ఇల్లందు పట్టణ వాసులకు మిగిల్చిన గుణపాఠం ఇదే.. ఆరోగ్యం అంటే కేవలం కసరత్తులు మాత్రమే కాదు, గుండె లయను కూడా అర్థం చేసుకోవడం!


జన సంఘర్షణ



# సింగరేణికి 'గల్ఫ్' సెగ: సంక్షోభంలో బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)






అంతర్జాతీయ యుద్ధ మేఘాలు తెలంగాణ ఆర్థిక ఇంజన్ 'సింగరేణి'ని కుదిపేస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ఇప్పుడు నేరుగా భూగర్భ గనులపై పడింది. బొగ్గు వెలికితీతకు అత్యంత కీలకమైన బ్లాస్టింగ్ మెటీరియల్, డ్రిల్ రాడ్లు, డిటొనేటర్ల దిగుమతులు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ఉత్పత్తి ప్రక్రియ స్తంభించిపోయే ప్రమాదం ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకు ధరలు ఆకాశాన్ని తాకడంతో, పాత ఒప్పందాల ప్రకారం సరఫరా చేయడం సాధ్యం కాదని కాంట్రాక్టర్లు తెగేసి చెబుతున్నారు. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థకు, ఈ ముడిసరుకు కొరత కోలుకోలేని దెబ్బగా మారింది. గల్ఫ్ యుద్ధం ముగిసే వరకు వేచి చూడటమా లేక పెరిగిన ధరలకు తలొగ్గి ఒప్పందాలు కుదుర్చుకోవాలా అన్న అయోమయంలో యాజమాన్యం కొట్టుమిట్టాడుతోంది.

**యుద్ధం ఎక్కడో.. దెబ్బ ఇక్కడ!**

ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడ ఏ మూల యుద్ధం జరిగినా దాని ప్రభావం స్థానిక పరిశ్రమలపై ఎలా ఉంటుందో చెప్పడానికి సింగరేణి ప్రస్తుత పరిస్థితి ఒక నిదర్శనం. గల్ఫ్ సంక్షోభం కేవలం చమురు ధరలకే పరిమితం కాలేదు; అది సింగరేణి లాంటి భారీ పరిశ్రమల వెన్నెముకను తాకింది.

సరఫరా గొలుసు విచ్ఛిన్నం: సింగరేణిలో బొగ్గును వెలికితీయడానికి వాడే హై-క్వాలిటీ డ్రిల్ రాడ్లు, డిటొనేటర్లు విదేశాల నుండి దిగుమతి అవుతాయి. యుద్ధం కారణంగా రవాణా మార్గాలు మూసుకుపోవడం, షిప్పింగ్ ఛార్జీలు పెరగడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం.

కాంట్రాక్టర్ల పట్టుబడటం: అంతర్జాతీయంగా ముడిసరుకు ధరలు పెరగడంతో, కాంట్రాక్టర్లు సవరించిన ధరల కోసం పట్టుబడుతున్నారు. ఒకవేళ సంస్థ కొత్త రేట్లకు అంగీకరిస్తే ఆర్థిక భారం మోయలేనంతగా పెరుగుతుంది; అంగీకరించకపోతే ఉత్పత్తి ఆగిపోయి విద్యుత్ రంగానికి ముప్పు వాటిల్లుతుంది.

ఆలోచించాల్సిన అంశం: నల్లబంగారం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామని చెప్పుకుంటున్న మనం, దానికి కావలసిన కనీస పరికరాల కోసం నేటికీ విదేశీ దిగుమతులపైనే ఆధారపడటం ఎంతవరకు సమంజసం? దేశీయంగా ఈ పరికరాల తయారీని ప్రోత్సహించకపోవడం వల్లే నేడు ఒక అంతర్జాతీయ యుద్ధం మన ఇంటి దీపాన్ని (కరెంటు) ఆర్పే స్థితికి చేరుకుంది.సింగరేణి యాజమాన్యం తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోతే, ఈ గల్ఫ్ సెగ రాష్ట్ర విద్యుత్ రంగాన్ని అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉంది. మేల్కోవాల్సింది కేవలం అధికారులు మాత్రమే కాదు, విధాన నిర్ణేతలు కూడా!

# ఇల్లందు మంచినీటి చెరువుపై 'నీటి దొంగల' కన్ను

❑ ఉక్కుపాదం మోపిన అధికారులు

ఇల్లందు ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)

సామాన్యుడి గొంతు తడిపే మంచినీటి వనరులపై స్వార్థపరుల కన్ను పడింది. ఇల్లందులపాడు మంచినీటి చెరువును కొందరు అక్రమార్కులు తమ సొంత ప్రయోజనాల కోసం యథేచ్ఛగా వినియోగిస్తుండటంపై మున్సిపల్ ఛైర్పర్సన్ కిరణ్ మిత్ర, కమిషనర్ గణేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చెరువు పరివాహక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన వారు, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ సాగిస్తున్న అక్రమ మళ్లింపులను చూసి మండిపడ్డారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాల్సిన జలవనరులను వ్యక్తిగత లాభం కోసం వాడుకుంటే సహించేది లేదని, అటువంటి వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ దోపిడీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులెవరైనా సరే కఠినంగా శిక్షించాలని స్పష్టం చేస్తూ, అక్రమార్కులకు బలమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రకృతి ప్రసాదించిన వనరులు ప్రజలందరి ఆస్తి. కానీ, నేడు కొందరి స్వార్థం వల్ల సామాన్యుడికి దక్కాల్సిన గుక్కెడు నీరు కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇల్లందులపాడు చెరువు ఉదంతం కేవలం ఒక అక్రమ నీటి మళ్లింపు వ్యవహారం మాత్రమే కాదు, అది సామాజిక స్పృహ కొరవడిన తీరుకు అద్దం పడుతోంది. నిఘా వైఫల్యమా లేక బరితెగింపా? మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చే వరకు ఈ అక్రమాలు జరుగుతున్నాయంటే, స్థానిక యంత్రాంగం నిఘా ఎక్కడ విఫలమైందన్న ప్రశ్న తలెత్తుతోంది.




నీరు – రేపటి జీవనాధారం: వేసవి కాలం ముంచుకొస్తున్న తరుణంలో, మంచినీటి వనరులను కాపాడుకోవాల్సింది పోయి, వాటిని దోచుకోవడం నేరం మాత్రమే కాదు.. భవిష్యత్తు తరాలకు మనం చేస్తున్న ద్రోహం.

ఆలోచించాల్సిన అంశం: అధికారులు కేసులు పెట్టినంత మాత్రాన పరిస్థితి మారుతుందా? పౌరుల్లో మార్పు రానంత కాలం, మన చెరువులను మనం కాపాడుకోలేనంత కాలం ఇటువంటి అక్రమాలు జరుగుతూనే ఉంటాయి. చట్టం తన పని తాను చేయాల్సిందే, కానీ ప్రజలే ఈ నీటి సంరక్షకులుగా మారినప్పుడే ఇల్లందు దాహం తీరుతుంది. ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తిగా భావించే ఈ 'జల దోపిడీ'కి అడ్డుకట్ట పడకపోతే, రేపు ప్రజలు గుక్కెడు నీటి కోసం వీధుల్లోకి రావాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం కేవలం హెచ్చరికకే పరిమితం కాకుండా, నిరంతర నిఘాగా మారాలని ఆశిద్దాం.

# తెలంగాణ ఏర్పాటుపై తేజస్వీ సూర్య వ్యాఖ్యలు అవివేకం

❑ కాసాని హరిప్రసాద్ యాదవ్ ధ్వజం

ఇల్లందు ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని భారత్-పాక్ విభజనతో పోల్చుతూ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవని, ఆయన అవగాహనా రాహిత్యానికి ఇది నిదర్శనమని ఇల్లందు బి ఆర్ ఎస్ ఇంచార్జ్ కాసాని హరిప్రసాద్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాల పోరాటం, వందలాది మంది అమరుల ప్రాణ త్యాగాలు, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షల ఫలితంగా సిద్ధించిన తెలంగాణను తక్కువ చేసి మాట్లాడటం అంటే తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని ఆయన మండిపడ్డారు.

"భారత రాజ్యాంగ నియమాలకు లోబడి, దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటు ఆమోదంతో ఏర్పడిన రాష్ట్రాన్ని చూసి అవాకులు చెవాకులు పేలడం తేజస్వీ సూర్య మిడిమిడి జ్ఞానానికి పరాకాష్ట" అని హరిప్రసాద్ యాదవ్ ఎద్దేవా చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, చరిత్రను కించపరిచేలా మాట్లాడే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని, తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ఒక పవిత్రమైన పోరాటమని, దానిని విభజన రాజకీయాలతో పోల్చడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగబద్ధత: పార్లమెంట్ సాక్షిగా ఏర్పడిన రాష్ట్రాన్ని తప్పుబట్టడం రాజ్యాంగాన్ని అవమానించడమే.

త్యాగాల స్మరణ: అమరుల బలిదానాల వల్ల ఏర్పడిన తెలంగాణను కించపరచడం సహించరానిది.

హెచ్చరిక: అవగాహన లేకుండా మాట్లాడితే తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

## భానుడి భగభగలకు 'పారిశుద్ధ్య' ఉపశమనం

❑ కార్మికుల పనివేళలు మార్పు!

ఇల్లందు ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)



ఎండల తీవ్రత దృష్ట్యా ఇల్లందు మున్సిపాలిటీ, సింగరేణి పారిశుద్ధ్య కార్మికుల విధుల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు సాగే పాత పనివేళలను సవరిస్తూ, శనివారం నుండి ఉదయం 6 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. జేకే సివిల్ విభాగంలో జరిగిన సమావేశంలో కార్మిక నేత యాకూబ్ షావలి మాట్లాడుతూ.. వేసవి తాపం నుండి కార్మికులను రక్షించేందుకే యూనియన్ల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ వెసులుబాటుపై కార్మిక వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది.

## పాల్వంచ మున్సిపాలిటీలో ఏసీబీ 'పంజా'

❑ పాత రికార్డులే టార్గెట్‌గా లోతైన విచారణ!

పాల్వంచ ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపల్ కార్యాలయం అవినీతి నిరోధక శాఖ అధికారుల రాకతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గతంలో నిర్వహించిన అకస్మిక తనిఖీల్లో లభ్యమైన కీలక పత్రాలు, డైరీల ఆధారంగా ఖమ్మం ఏసీబీ సీఐ బాలాజీ నేతృత్వంలోని బృందం శుక్రవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. కార్యాలయంలోని పలు విభాగాల్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, గత కొంతకాలంగా వినిపిస్తున్న అవినీతి ఆరోపణలపై సిబ్బందిని సుదీర్ఘంగా ప్రశ్నించారు. ముఖ్యంగా నిధుల మళ్లింపు, అనుమతుల్లో చేతులు మారిన వసూళ్లపై అధికారులు గురిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ సోదాలతో మున్సిపల్ వర్గాల్లో ప్రకంపనలు మొదలవగా, బాధ్యులైన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# సొసైటీ వారు రైతులపై వివక్ష

❑ రైతుల పాలిట శాపంగా మారుతున్న రుద్రూర్ సొసైటీ సెక్రటరీ ఇతరులు

నిజామాబాద్/రుద్రూర్/ఏప్రిల్17/. (జన సంఘర్షణ)



రుద్రూరు నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని చిన్న సన్నకారు రైతులు తమకు రుద్రూరు సొసైటీ సెక్రటరీతో పాటు ఇతరులు శాపంగా మారుతున్నారని తమ గోడును మీడియాకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆరబోసిన ధాన్యం ఎదుట అదే విధంగా సొసైటీ ఎదుట నిరసన చేసి తమ బాధను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 రోజుల క్రితం వడగండ్ల వర్షం భారీ వర్షం కురవడంతో తమ పంట పూర్తిగా నష్టపోయిందని 40 సంచులకు గాను కేవలం 20 సంచులు మాత్రమే వచ్చాయని వచ్చిన ధాన్యం కూడా ఆరబోసి 15 రోజులు అవుతున్న సెక్రటరీ మాత్రం పట్టించుకోవడంలేదని ఆయన చుట్టూ సుమారు 15 రోజుల నుంచి తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరబోసిన ధాన్యం తీసుకోవడంలో కాలయాపన చేస్తున్నారని చిన్న సన్న రైతుల పట్ల పూర్తిగా వివక్ష చూపుతున్నారని పెద్ద రైతుల ధాన్యం తీసుకుంటున్నారు తప్ప చిన్న సన్న రైతుల ధాన్యం తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. చిన్న రైతుల పట్ల రుద్రూర్ సొసైటీ సెక్రటరీ తో పాటు ఇతరులు వివక్ష చూపుతున్నారని వీరి నిర్లక్ష్యంపై జిల్లా స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ అదేవిధంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టిపెట్టి చిన్న సన్న రైతులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది.

## ఎంపీ తేజస్వి సూర్యపై దిండిగాల రాజేందర్ నిప్పులు

❑ ఇల్లందులో భగ్గుమన్న నిరసన!

❑ 'తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించం'

ఇల్లందు ఏప్రిల్ 17 ( జన సంఘర్షణ)



పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రాంతీయ చిచ్చును రగిల్చాయి. ఈ వ్యాఖ్యలపై ఇల్లందు ఉద్యమ నేత దిండిగాల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఇల్లందులో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాది మంది ప్రజల దశాబ్దాల కల, వందలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచేలా మాట్లాడటం ఎంపీ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా జరిగిన ప్రక్రియను అవహేళన చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి సదరు ఎంపీపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై విషం చిమ్మే ఇటువంటి నాయకులు భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి ఢిల్లీ పీఠాన్ని కదిలిస్తామని దిండిగాల రాజేందర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఇల్లందు గడ్డ సాక్షిగా మరో పోరాటానికి సిద్ధమని ఆయన పిలుపునిచ్చారు.

## సాంగ్లీ జిల్లాలో డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ వేగవంతం

తెలంగాణ /సాంగ్లీజిల్లా/ఏప్రిల్17/(జనసంఘర్షణ)



సాంగ్లీ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వేగవంతమైంది. ఈ నేపథ్యంలో జిల్లా పరిధిలోని ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలకు ఏఐసీసీ అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరై, డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను స్వయంగా సేకరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి వర్గం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కూడా పాల్గొని, సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీ నిర్మాణం మరింత బలపడుతుందని తెలిపారు. క్రమబద్ధమైన విధానంలో నాయకత్వాన్ని ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌లో మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ, రాబోయే ఎన్నికల దృష్ట్యా సమర్థ నాయకత్వాన్ని ఎంపిక చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని నాయకులు స్పష్టం చేశారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -17 (జన సంఘర్షణ )



కరెంట్ షాక్ తో మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ గ్రామానికి చెందిన రాజిరెడ్డి (కేబుల్ టీవీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తన ఇంట్లో ఉన్న పాత ఎయిర్ కూలర్‌ను మరమ్మతు చేసి వినియోగించుకోవాలని రాజిరెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం 8:30 గంటల సమయంలో కూలర్‌కు కరెంట్ కనెక్షన్ ఇచ్చి రిపేర్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు లైవ్ వైర్ అతని చేతికి తగిలింది. దీంతో తీవ్ర కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజిరెడ్డిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మొక్కజొన్న సబ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- **అవసరమైన చోట్ల సబ్ సెంటర్లు ప్రారంభిస్తాం**
- **మార్క్ ఫెడ్ ఎం. డి ని కలిసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ముధోల్, ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)

మొక్కజొన్న రైతుల పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని, ఈపాటికి అన్ని మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ లో మార్క్ఫెడ్ డిఎం శ్రీనివాస్ రెడ్డిని కలిసిన సందర్భంగా మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గం లో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పంట ఉందని, భారీ వర్షాలతో రైతుల నష్టపోయారని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేపడితే కొంతైనా మేలు జరుగుతుందని ఆయన డిఎంకు తెలియజేశారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉన్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్మితే క్వింటాలుకు 700 రూపాయల వరకు అధిక ధర వస్తుందని, వెంట వెంటనే కొనుగోలు చేపట్టి, పంట అమ్మినా డబ్బులను రైతుల ఖాతాల్లో సత్వరం వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ప్రధాన కొనుగోలు కేంద్రాలతో పాటు సబ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవని, ఎక్కడ ఎక్కడ సబ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలో ఆయన రాతపూర్వకంగా ఎండికి వివరించారు. నియోజకవర్గంలో 30కి పైగా సబ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అమ్మకానికి పంట తెచ్చిన వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. మొక్కజొన్న రైతులు ఆందోళన పడకుండా తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## విద్యార్థులతో కబాడీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి/ఏప్రిల్ 17/(జన సంఘర్షణ)

జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం పక్కన నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, జరుగుతున్న పనుల నాణ్యతను అంచనా వేసి, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను సంబంధిత అధికారులకు అందించారు. అలాగే అక్కడ నిర్వహిస్తున్న కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును సందర్శించి, విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు. ఈ ఇండోర్ స్టేడియంలో 4 షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా హాల్, ఇండోర్ గేమ్స్ సదుపాయాలు, జిమ్, రైఫిల్ షూటింగ్, స్క్వాష్ కోర్ట్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. జిల్లాలో యువతకు క్రీడలు, వినోద కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని అన్ని రకాల క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో ఎన్.వై. గిరి, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, కాంట్రాక్టర్ ఏజెన్సీ సభ్యుడు వెంకటరమణ, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను కలిసిన ప్రెస్ మిల్లర్ యజమానులు




కామారెడ్డి/ఏప్రిల్17/(జన సంఘర్షణ)

రాష్ట్ర రా రైస్ మిల్ అధ్యక్షులు గణపతి రెడ్డితో, రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్రని కలిసి రాష్ట్ర రా రైస్ మిల్లర్ల సమస్యలను వివరించిన కామారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షులు కమ్మ సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైస్ మిల్లర్లకు ఎప్పుడు తన సహకారం ఉంటుందని సివిల్ సప్లై కమిషనర్ రైస్ మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ యువతకు ఎలక్ట్రిక్ వెహికల్స్..

- **రూ.3 లక్షలకు రూ.70 వేలు కడితే చాలు..!**

హైదరాబాద్ /ఏప్రిల్17/(జన సంఘర్షణ)



రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ యువత ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.219 కోట్లతో ఈ-కామర్స్, లాజిస్టిక్స్, సోలార్ రంగాల్లో 10 వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా భారీ సబ్సిడీతో ఈ-వాహనాలు, పశుసంపద యూనిట్లు పంపిణీ చేయనున్నారు. మరోవైపు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో 10,500 మంది గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు మే 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

# పోచారం శ్రీనివాస్ రెడ్డి బారస ఎమ్మెల్యేనా?

- **మళ్లీ బారాసలోకి ఎలా చేరుతారు..**

తెలంగాణ బాన్సువాడ/ఏప్రిల్17/(జన సంఘర్షణ)

2023 శాసనసభ ఎన్నికలు జరగగానే పదిమంది బారస ఎమ్మెల్యేలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. వీరిలో కామారెడ్డి జిల్లా బాన్స్వాడ నియోజకవర్గానికి చెందిన బారాస ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి పేరిట సాకుచూపుతూ ,పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇది ప్రపంచమంతా ఎరిగిన సత్యం. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు, హైకోర్టు మూడు నెలల్లో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై సమగ్రంగా విచారణ జరిపి నివేదిక పంపాలని ఆదేశించింది. అంతేకాకుండా మూడు నెలల పాటు శాసనసభాపతి ప్రసాద్ కుమార్ విచారణ జరిపి, బారస నుంచి కాంగ్రెస్లోకి చేరినట్లు చెప్పుకుంటున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఖర కండిగ తెలిసి చెప్పారు. ఈ విషయంలో హైకోర్టు కూడా సమర్పించింది. పదిమంది బారాస ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని సభాపతి ప్రసాద్ కుమార్ వెల్లడించారు. శాసన సభాపతి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలకు చుక్క ఎదురయింది . తమ తమ నియోజకవర్గంలో తాము ఏ పార్టీ ఎమ్మెల్యేలను అని చెప్పుకోలేని పరిస్థితి పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని సీనియర్ నాయకులు మంత్రి పదవులు, శాసనసభ ప్రతిగా పనిచేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోచారం ఇంటికి వెళ్లి కండువా కప్పి కాంగ్రెస్లోకి ఆహ్వానించారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై హైకోర్టుకు బారస కార్యనిర్రాక అధ్యక్షుడు కేటీఆర్ ఆశ్రయించారు. హైకోర్టు ఈ విషయాన్ని సభాపతికే అప్పగించింది. మూడు వారాల్లో ఈ విషయంపై ఏదో ఒకటి తేల్చాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో శాసనసభాపతి ప్రసాద్ కుమార్, తమ పార్టీలో చేరినట్లు చెప్పుకుంటున్న బారస ఎమ్మెల్యేలకు తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదు అని వెల్లడించారు.

అయితే ఇప్పుడు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఏ పార్టీకి చెందినవారు? అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇక బాన్సువాడ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలు కాలంగా రా రాజుగా ఎదిగిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఏ ఆలోచనతో, ఏమి ఆశించో కాంగ్రెస్ పార్టీలోకి చేరడం పట్ల నియోజకవర్గంలో తన ఆధిపత్యం పూర్తిగా తగ్గిపోయింది. ఒకవైపు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, మరొక పక్క ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ముగ్గురు కూడా కాంగ్రెస్ నాయకులమని చెప్పుకుంటున్నారు. వాస్తవానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాస పార్టీలో నుంచి కాంగ్రెస్లోకి దూరారు . ఒకటేసారి ఇది బాన్స్వాడ రాజకీయం రూపు రేఖలే మారిపోయింది. పోచారం



వర్గం, ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం గా చీలిపోయి బాన్సువాడలో నువ్వా నేనా అనే చెందగా వీరి ఆగడాలు, అరాచకాలు పెరిగిపోయాయి. ఏది ఏమైనప్పటికీ పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాస ఎమ్మెల్యే అని శాసనసభాపతి ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఇప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి బరాస ఎమ్మెల్యే గా చెప్పుకోవచ్చు. ఎందుకంటే శాసన సభాపతి ప్రసాద్ కుమార్, పోచారం శ్రీనివాస్ రెడ్డి తో తమకు ఎలాంటి సంబంధం లేదు అని, పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, ఆయన ఇప్పటికీ బారాస ఎమ్మెల్యే అని శాసనసభాపతి ప్రసాద్ కుమార్ వెల్లడించారు. అయితే ఇప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వాడు. కొన్ని యూట్యూబ్ ఛానల్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాసలోకి చేరుతున్నారని ప్రకటిస్తున్నారు. అసలు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వాడు? శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి పై ఏమని వ్యాఖ్యలు చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తమ పార్టీ ఎలాంటి సంబంధం లేదు అని చెప్పినప్పటికీ కొన్ని యూట్యూబ్ ఛానల్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాసలోకి చేరుతున్నారని ప్రచారం జరుగుతుంది. సభాపతి చెప్పిన విధంగా పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీతో ఏం సంబంధం లేదని స్పష్టంగా తెలుస్తుంది. బారాసలో ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి మళ్ళీ బారాసలోకి వస్తున్నారని పుకార్లు షికార్లు వినిపిస్తున్నాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బారాసాల్లోకి చేర్పించుకునే పరిస్థితి లేదని గులాబీ నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముందే హెచ్చరించారు. అయితే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బారాసలోకి తీసుకొని ప్రసక్తి కనిపించడం లేదు. పోచారం శ్రీనివాస్ రెడ్డి చేయాల్సింది రెండే ఒకటి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి, ఎందుకంటే తాను బారాస ఎమ్మెల్యేగా చెప్పుకుంటున్నాడు. అయితే మళ్లీ ఎన్నికలు పెట్టి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తావో, బారస పార్టీ నుంచి పోటీ చేస్తావో తెలుసుకోవాల్సిన విషయం కు పోచారం కు ఉంది . అధికారం పార్టీలో ఉన్నామని గొప్పగా చెప్పుకుంటున్నా పోచారం శ్రీనివాస్ రెడ్డి సిద్ధాపూర్ రిజర్వాయర్ పథకానికి నిధులు ఇవ్వడం లేదంటూ అధికార పార్టీపై తిరుగుబాటు చేశారు. తాను సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రిని అయినప్పటికీ తాను ఫోన్ చేస్తే సీఎం తో పాటు మంత్రులు కూడా తన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదంటూ ఆయన కడుపులో ఉన్న మాట బయటపెట్టారు . అంటే అసలు విషయం చూద్దాం కాంగ్రెస్ పార్టీ అంటే అది సముద్రం లాంటి పార్టీ పోచారం లాంటి ఎంతో పెద్ద నాయకుడు కూడా ఈ కాంగ్రెస్ పార్టీలో పెత్తనం కొనసాగదు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మరో ఐదుగురు మంత్రులే రాజ్యమేలుతున్నారు ఇప్పటివరకు ప్రాంతీయ పార్టీలో పనిచేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఒకవైపు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ నేత నందమూరి తారక రామారావు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, గులాబీ నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు పోచారం శ్రీనివాస్ రెడ్డికి తన అనుభవాన్ని బట్టి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు. అవసరమైతే పోచారం నుంచి కేసీఆర్, చంద్రబాబు సలహాలు సూచనలు తీసుకున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి సబ్జెక్టు పై అవగాహన కలిగిన పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాసలోకి చేరడమే పెద్ద తప్పుగా జరిగింది. ఆయనను నమ్ముకున్న కార్యకర్తలను, నాయకులను నట్టేట ముంచారు. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం పోచారం శ్రీనివాస్ రెడ్డి తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని చెప్పుకుంటున్నారు, కానీ శాసనసభాపతి ప్రసాద్ కుమార్ మాత్రం పోచారం కు తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదు, పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాస ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని శాసన సభాపతి వెల్లడించడం రాజకీయంలో ఒక చర్చ మొదలైంది. శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కాదు, భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా వెల్లడించారు. మళ్లీ పోచారం శ్రీనివాస్ రెడ్డి బారాసలోకి వస్తున్నారని పుకార్లు వినిపిస్తున్నాయి. ఒక్క విషయం ఆలోచించండి కన్న తల్లి లాంటి బారాస వదిలి కాంగ్రెస్ పార్టీలోకి చేరడం, కానీ కానీ పోచారం శ్రీనివాస్ రెడ్డి తమ పార్టీకి చెందిన కారు అని కరాకండిగా ప్రకటించారు. ఇప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీ? బారాస, కాంగ్రెస్ ఎమ్మెల్యే నా?పబ్లిక్ టాక్ వినిపిస్తుంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటే వెంటనే బారాస పార్టీకి రాజీనామా చేసి మళ్లీ ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. పోచారం భవిష్యత్తు తెలుసుకోవాల్సిందే.

## ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో 'కాయకల్ప' బృందం తనిఖీ



ఇల్లందు ఏప్రిల్ 17 (జన సంఘర్షణ)

ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా శుక్రవారం 'కాయకల్ప' ఎక్స్టర్నల్ అసెస్మెంట్ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టింది. బృందం సభ్యులు డాక్టర్ రఘు పూజారి, డాక్టర్ జోత్స్న ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ ప్రక్రియ తీరుతెన్నులు, ల్యాబ్ సౌకర్యాల లభ్యతపై వారు ఆరా తీశారు. అనంతరం వార్డుల పరిశుభ్రత, మెడికల్ రికార్డుల నిర్వహణ, నర్సింగ్ సేవల తీరును పరిశీలించిన బృందం, ఆసుపత్రి యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ లక్ష్యం మేరకు రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఇల్లందు ఆసుపత్రి ముందంజలో ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇల్లందులో రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత



ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణంలో 18 ఏప్రిల్ 2026, శనివారం నాడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 33/11 కే.వి ఇల్లందు ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 11 కే.వి ఇల్లందు టౌన్ ఫీడర్, రామాలయం ఫీడర్, ప్రభుత్వ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. అందువల్ల ఆయా ప్రాంతాల వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ అవమానంపై ఆగ్రహ జ్వాలలు...

- **తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలి: దిండిగాల రాజేందర్**
- **తెలంగాణపై వ్యాఖ్యలు... క్షమాపణ డిమాండ్**



ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ)

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా మహిళల బిల్లుపై మాట్లాడకుండా, తేజస్వి సూర్య తెలంగాణ విభజనను భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం తీవ్రంగా అభ్యంతరకరమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని, అలాగే తెలంగాణ ప్రజల భావాలను అవమానించే విధంగా ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ, తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను అవహేళన చేసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఏర్పాటు కోసం భారతీయ జనతా పార్టీ కూడా సంయుక్త చర్య కమిటీతో కలిసి ఉద్యమాల్లో పాల్గొని, పార్లమెంట్లో తెలంగాణ బిల్లుకు మద్దతు ఇచ్చిందనే విషయం కనీస అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. పార్లమెంట్లో దాదాపు అన్ని రాజకీయ పక్షాలు తెలంగాణ బిల్లును సమర్థించాయని, ఈ వ్యాఖ్యలతో వారందరినీ అవమానించినట్లే అవుతుందని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్యను పదవి నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిండిగాల రాజేందర్ గారితో పాటు సుదర్శనం రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, శీలం రమేష్, పరిచూరి వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబీ, అజ్మీరా భావ్ సింగ్, ఎస్.కె. గాజి, దాస్యం ప్రమోద్, దేరంగుల పోషం, నాగరాజు, నారపాక వసంతరావు, రాచపల్లి శ్రీను, సనా రాజేష్, ఉపేందర్, స్వర్ణపాక సత్యనారాయణ, రామ్లాల్ పాసి, లలిత్ పాసి, శ్రీకాంత్, మల్సూర్, యలమందల వాసు, చిన్నారి, ముత్తయ్య, గడ్డి శ్రీను, ఆటో పాసి, గధే రమేష్, శ్రీను, ఎస్.కె. ఇమ్రాన్, గోల్డ్ ఇమ్రాన్, షేక్ కరీం పాషా, చీమల సుజాత, మదర్ బీ, భాగ్య, దమర శ్రీనివాస్, కుంజ సతీష్, మనఘంటి శివ, రసూల్, మాన్య, కిషన్ పాసి, వీరభద్రం, శ్రీనివాసరావు, కోడి లక్ష్మయ్య, బజారు సత్యనారాయణ, ఖమ్మ, శ్రీకాంత్ యాదవ్ తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్య తీరలేదు.. సమ్మె ఆగలేదు..

- పదవ రోజుకు చేరిన తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ సమ్మె
- షాద్ నగర్‌లో అర్ధ నగ్న ప్రదర్శన చేసిన ఉద్యోగులు

షాద్నగర్/ఏప్రిల్17/(జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ అధికారులు 10 రోజులుగా సమ్మెకు దిగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం పట్ల విద్యుత్తు కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి ముందుకు కదులుతున్నారు. వాస్తవమైన తమ డిమాండ్లను ప్రభుత్వం పెడచెవున పెడుతుందని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. దీక్షకు పూనుకొని పది రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత మంత్రి గానీ, సంబంధిత శాఖ అధికారులు గానీ స్పందించకపోవడం పట్ల ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే దాకా సమ్మె ఆపేది లేదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. పలు డిమాండ్లను ప్రజల ముందు ఉంచుతూ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని




అందించారు. డివిజన్ జేఏసీ చైర్మన్ కావాలి ఆంజనేయులు యాదవ్, కన్వీనర్ పటేల్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ ఎప్పుడు.?

- జర్నలిస్టులకు రక్షణ ఏది.?
- దాడులు, బెదిరింపులు పెరుగుతున్న వేళ చట్టం కోసం టీజేఎస్ఎస్ డిమాండ్
- తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టీజేఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ

హైదరాబాద్ /ఏప్రిల్17/(జన సంఘర్షణ)



తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరమని టీజేఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం నిత్యం శ్రమించే ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణించే మీడియా ప్రతినిధులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు.

**ఎవరు పడితే వారు దాడులకు దిగుతున్నారన్న ఆందోళన**

రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు, గల్లీ స్థాయి నాయకులు, వారి అనుచరులు ఇలా ఎవరు పడితే వారు జర్నలిస్టులపై దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారని గౌటి రామకృష్ణ విమర్శించారు. వాస్తవాలు రాస్తున్నందుకు, అవినీతి, అక్రమాలు వెలికితీస్తున్నందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు.

**ఆధారాలు లేకుండా కేసులు, పోలీసుల వైఖరి మారాలి**

చాలా సందర్భాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండానే జర్నలిస్టులపై కేసులు నమోదు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖ కూడా వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఫిర్యాదు చేశారన్న నేపంతో ముందుగా జర్నలిస్టులపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకుల, అధికారుల ఒత్తిడికి పోలీసులు లోనై నిర్దోషులైన జర్నలిస్టులను జైలుకు పంపించడం ఆందోళన కలిగించే విషయం అని అన్నారు.

**ఫోర్త్ ఎస్టేట్ విలువ కావాలని తగ్గిస్తున్నారా.?**

ప్రజల సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా విలువను కొందరు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన రంగంలో పనిచేసే జర్నలిస్టులకే రక్షణ లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరించారు. అందుకోసమే జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరం అన్నారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు అరికట్టాలంటే ప్రత్యేక చట్టం అవసరమని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు. జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి వస్తేనే మీడియా ప్రతినిధులు భయంలేకుండా పని చేయగలరని అన్నారు. ఈ చట్టం ద్వారా దాడులకు, బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

**అందరూ ఏకతాటిపైకి రావాలి**

జర్నలిస్టులు సంఘాలకు అతీతంగా ప్రతి జర్నలిస్టు, ప్రతి సంఘ నాయకుడు ఒకే వేదికపైకి రావాలని గౌటి రామకృష్ణ పిలుపునిచ్చారు. "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" సాధన కోసం సమిష్టిగా పోరాడితేనే ఫలితం సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల రక్షణ కోసం చట్టం తీసుకురాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రత కోసం పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు.

## యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాండ్ రైస్ సేకరించాలి

- కేంద్ర హర ప్రజా పంపిణీ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్ / ఏప్రిల్/17/(జన సంరక్షణ)

యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌తో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. 2014-15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల




చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి , సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్ తో పాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


# బజాజ్ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి


- ప్రజల డిమాండ్..

కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 17:

కామారెడ్డి జిల్లా కేంద్రంలో బజాజ్ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల వ్యవహారంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం, మొత్తం రుణం చెల్లించినప్పటికీ రికవరీ ఏజెంట్లు ఇంటికి వచ్చి కస్టమర్లతో అనుచితంగా ప్రవర్తిస్తూ, అవసరం లేని నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విధంగా కస్టమర్లను ఇబ్బందులకు గురి చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న రికవరీ ఏజెంట్లపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ప్రజలు కోరుతున్నారు.





## బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

హైదరాబాద్ /ఏప్రిల్17/(జన సంఘర్షణ)



తెలంగాణ ఏర్పాటును భారత్ పాకిస్తాన్ల విభజనతో పోలుస్తూ పార్లమెంట్లో చేసిన కామెంట్స్ తీవ్ర చర్చనీయాంశమైంది. తేజస్వి సూర్య మతి తప్పి మాట్లాడుతున్నారు. సభలో పెట్టిన బిల్లు ఏంటి తేజస్వి సూర్య మాట్లాడిన మాటలు ఏంటి? తేజస్వి సూర్య మాట్లాడుతుంటే కనీసం అడ్డుకునే స్థితిలో కూడా బిజెపి తెలంగాణ ఎంపీలు లేకపోవడం సిగ్గుచేటు. బిజెపి మొదటి నుండి తెలంగాణ వ్యతిరేకి. ప్రధాని మొదలు ఆ పార్టీకి చెందిన కీలక నేతలు పలు సందర్భాల్లో తెలంగాణ ఏర్పాటును కించపరిచేలా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన సహించబోము. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బిజెపి ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలి. రేపిస్టులను టికెట్లు ఇచ్చి ప్రోత్సహించినటువంటి పార్టీ బిజెపి. అట్లాంటి పార్టీ మహిళల హక్కుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది అత్రాస్, ఉన్నావ్ అత్యాచార దోషులను బిజెపిలో చేర్చుకుని ప్రోత్సహించింది ఆ పార్టీ నేతలే. సామ్రాట్ చౌదరి లాంటి రేపిస్ట్ ని ప్రోత్సహించేది కూడా బిజెపినే. ట్విట్టర్ టిల్లు కేటీఆర్ టాపిక్ డైవర్షన్ కి పాల్పడుతున్నాడు. తెలంగాణ తెచ్చింది, తెలంగాణ కోసం పోరాడింది, ప్రస్తుతం తెలంగాణను అభివృద్ధి చేస్తుంది కాంగ్రెస్ పార్టీనే. తెలంగాణ ఏర్పాటులో బిజెపి పాత్ర ఏం లేదు.

## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం. భారీ ర్యాలీ !!

- పాల్గొన్న పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్

సంగారెడ్డి/ఏప్రిల్17/(జన సంఘర్షణ)



రాహుల్ గాంధీ నాయకత్వంలో మల్లికార్జున్ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశానుసరం నేడు డిలిమిటేషన్ బిల్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షణది రాష్ట్రాలకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈ రోజు సాయంత్రం 6 గంటలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఐబి నుండి ర్యాలీ కార్యక్రమం కలదు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకాగలరు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదంపై అవగాహన

బోధన్ ఏప్రిల్ 17 /(జనసంఘర్షణ)



అగ్ని ప్రమాదాల జరిగినప్పుడు తీసుకోవలిసిన జాగ్రత్తలపై బోధన్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు, సిబ్బందికి అగ్ని మాపక కేంద్రం అధికారులు వివరించారు. అగ్నిమాపక వారోత్సవాలు భాగంగా శుక్రవారం అవగాహన కలిపించారు. అగ్నిప్రమాదం జరిగిన సందర్భంలో స్పందించాల్సిన తీరు వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ అగ్ని మాపక కేంద్రం అధికారి కే. సుభాష్, సిబ్బంది ఎం. నర్సయ్య, మహ్మద్ నజీమ్, కే. గంగారం పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న సూడ చైర్మన్

తెలంగాణ/ఏప్రిల్17/(జన సంఘర్షణ)



సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కుటుంబసమేతంగా వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల సుడా చైర్మన్ కూతురు వివాహం జరిగిన విషయం తెలిసిందే నూతన వధూవరులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీవారిని ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం చేసుకున్నారు. తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి డా. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ

న్యూఢిల్లీతెలంగాణ/ఏప్రిల్17/(జనసంఘర్షణ)




తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ రాజ్యసభ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్య క్రమానికి మంత్రి డా. వివేక్ వెంకట స్వామి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. అనంతరం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు , సహచర ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. వేం నరేందర్ రెడ్డి తన పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఖబర్దార్ తేజస్వి సూర్య నోరు అదుపులో పెట్టుకో

◆ **తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి : మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా!**

కామారెడ్డి/(ఏప్రిల్17/(జన సంఘర్షణ)

గడ్డం ఇందు ప్రియా మాట్లాడుతూ.. గతంలో మహిళా రిజర్వేషన్ ద్వారా గడ్డం ఇందుప్రియ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా, చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'మహిళా బిల్లు'కు ఆమె తన పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె లైవ్ టీవీలో మాట్లాడుతూ బిల్లు ప్రాముఖ్యతను వివరించారు.

(మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి): 33% రిజర్వేషన్: లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం.

నారీ శక్తి వందన్ అధినియం: ఈ బిల్లును అధికారికంగా 'నారీ శక్తి వందన్ అధినియం' అని పిలుస్తారు.

అమలు కాలం: ఈ రిజర్వేషన్ ప్రారంభంలో 15 ఏళ్ల పాటు అమలులో ఉంటుంది, ఆ తర్వాత పార్లమెంటు దీనిని పొడిగించవచ్చు.

సీట్ల పెంపు: 2026 తాజా సమాచారం ప్రకారం, లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా 2029 ఎన్నికల నాటికి మహిళలకు సుమారు 273 సీట్లు కేటాయించే అవకాశం ఉంది.

సామాజిక ప్రాతినిధ్యం: ఈ కోటాలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా అంతర్గత రిజర్వేషన్లు ఉంటాయి. డి లిమిటేషన్ను ఒకటిగా ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలను మభ్యపెడుతుంది. కాంగ్రెస్ పార్టీ డి లిమిటేషన్కుబిల్ వ్యతిరేకత తెలుపుతుంది అని తెలిపారు.






# ఏసీబీ వలలో బిల్లు కోసం రూ.50వేలు లంచం డిమాండ్..

◆ **ఏసీబీచిక్కిన మున్సిపల్ ఏఈ**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ /ఏప్రిల్17/(జన సంఘర్షణ)

అవినీతి అధికారి వేటలోతెలంగాణ ఏసీబీదూకుడు పెంచింది.కరీంనగర్ జిల్లా హుజురాబాద్మునిసిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్నఒక అధికారి కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా అడ్డంగా దొరికిపోయాడు.పూర్తి పనులు చేసిన బిల్లులు ఆపేసినవేధిస్తున్న తీరుపై విసిగిపోయిన బాధితుడుఏసీబీని ఆశ్రమించడంతో ఈ భాగోతం వెలుగులోకి వచ్చింది .

ఏం జరిగిందో ఉంటే...

హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోఒక కాంట్రాక్టర్ తుఫాన్ నీటి కాలువనిర్మాణ పనులు పూర్తిచేశారు.ఈ పనులకు సంబంధించిన మేనేజ్మెంట్ బుక్ లో వివరాలు నమో చేసిన ఫైల్ బిల్లును ప్రాసెస్చెయ్యాలనిఉండగా అసిస్టెంట్ ఇంజనీర్ ఏ ఈ నుసుం సుధాకర్ రెడ్డి చక్రం తిప్పాడు.పని పూర్తి చేసినందుకు.ఆఫీస్ పేపర్ కింద రూ. 50,000లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడుఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు పక్క ప్రణాళికతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.

**ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద సీన్!!!**

హుజురాబాద్ లోని ఆర్టీసీ డిపో చౌరస్తా వద్దసదురు కాంట్రాక్టర్నుంచి రూ. 50,000లంచం తీసుకుంటుండగాఏసీబీఅధికారుల మెరుపు దాడి.చేశారుసుధాకర్ రెడ్డి ని రెడ్ హ్యాండ్ గా పట్టుకొని ఆయన చేతిలో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు.అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు విచారణ చేపట్టారు.

అవినీతి పైఫిర్యాదు చేయండి:ఏసీబీ ఏ ప్రభుత్వ అధికారైన లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా ఫిర్యాదు చేయాలనిఏసీబీ అధికారులు కోరుతున్నారు.బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని బరోసా ఇచ్చారు.

**సంప్రదించవలసిన వివరాలు:.....**

టోల్ ఫ్రీ నెంబర్:1064
వాట్సాప్ నెంబర్:9440446106



ఫేస్ బుక్ : Telangana AcB
వెబ్సైట్: Acb. Telangana. gov. in
ట్విట్టర్ : @Telangana AcB

# బీజేపీ ఎంపీ తేజస్వి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి







◆ **పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసన**
◆ **రాష్ట్ర విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం**
◆ **ప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ఎంపీలతో కలిసి నినాదాలు చేసిన రామసహాయం**

తెలంగాణ/ఏప్రిల్17/(జన సంఘర్షణ)

న్యూ ఢిల్లీ: పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం పార్లమెంట్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడటాన్ని భారత్– పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, ఇది తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమే అని అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కారని, పార్లమెంటు రికార్డుల్లో ఈ వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ.. " బిజెపి క్షమాపణలు చెప్పాలి", " తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ..నినాదాలతో హోరెత్తించారు.

# ఎకో టూరిజం కేంద్రంగా 'బొగ్గుల రేవు'

◆ **పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి సమగ్ర పరిశీలన.**
◆ **సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు.**
◆ **ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.**

కుప్పం,ఏప్రిల్ 17 (జన సంఘర్షణ )



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధి ప్రణాళికలు కార్యరూపం దాల్చానున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను, టూరిజం అభివృద్ధికి గల సాధ్యాసాధ్యలను శరవేగంగా పరిశీలనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రామకుప్పం మండలం ననియాల వద్ద ఎలిఫెంట్ కేంద్రంతో పాటు టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కుప్పం మండలం పరమసముద్రం సమీపంలో వెలసిన బేటరాయ స్వామి కొండ ప్రాంతాన్ని కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కుప్పం మండలం అడవిభూదుగురు పంచాయతీకి చెందిన బొగ్గుల రేవును ఎకోటూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. దీంతో ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం ఆ ప్రాంతాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మండలం అడవిబుదుగూరు గ్రామపంచాయతీ పరిధిలోని బొగ్గుల రేవులను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సమగ్ర భూ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సంబంధిత అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి సహజ సౌందర్యం, పర్యావరణ పరిస్థితులు, పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించడం జరిగింది. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించడం జరిగింది.

## మెకానిక్ షెడ్డులో నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యంపై నిజామాబాద్ సిసిఎస్ టీం మెరుపు దాడి!!

నిజాంబాద్ సిటీ . ఏప్రిల్ 17 . (జన సంఘర్షణ )



నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు. సి సి ఎస్ఏ.సీ.పీ ఇంచార్జ్ మస్తాన్ అలి సూచనల మేరకు ఇన్స్పెక్టర్ సురేష్, డి.సాయినాథ్ , ఎస్.ఐ మహేష్, సిబ్బందితో కలిసి నాలుగవ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెకానిక్ షెడ్డులో పిడిఎస్ బియ్యం ఉన్నాయన్న సమాచారం మేరకు సుమారు 8.5 కింటల్స్ పిడిఎస్ బియ్యము, పిడిఎస్ బియ్యం తరలించడానికి ఉపయోగించిన స్కూటీ అదుపులోకి తీసుకొని పిడిఎస్ బియ్యం తరలిస్తున్నటువంటి మీర్జా అబ్బాస్ బేగ్ ను అదుపులోకి తీసుకొని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కి తగు చర్య నిమిత్తం అప్పచెప్పడం జరిగింది.

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లి గరుడదాత్రి (జన సంఘర్షణ )



బైరెడ్డిపల్లి మండలం లోని బేలుపల్లి పంచాయతీ పట్నపల్లి లో వెలిసివున్న శ్రీకళ్యాణవెంకటరమణ స్వామి అలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ బుధవారం నుండి మే 7 వ తేదీ గురువారం వరకు కొనసాగనున్నట్లు ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, అర్చకులు మురళి కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. 29వతేది బుధవారం ద్వజప్రతిష్ఠ, శాంతి హోమాలు ,ధ్వజారోహణం, రాత్రి శేషవాహనం, 30వతేది గురువారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం, మే 1వ తేదీ శుక్రవారం గురుడోత్సవం, అభిజిత్ లగ్నం నందు బ్రహ్మ రథోత్సవం, రాత్రి రథోత్సవం, గరుడవాహనం, 2వతేది శనివారం గ్రామోత్సవం, రాత్రి హంస వాహనం, 3వ తేదీ ఆదివారం గ్రామోత్సవం, రాత్రి సింహ వాహనం, హనుమంత వాహనం, 4 వ తేదీ సోమవారం మొక్కుబడి ఉత్సవాలు రాత్రి పుష్పపల్లిక సేవ, 5వ తేదీ మంగళవారం మొక్కుబడి ఉత్సవాలు, రాత్రి గజ వాహనం, 6 వతేది బుధవారం మొక్కుబడి ఉత్సవాలు, రాత్రి ఉంజలోత్సవం, అశ్వవాహనం, ధోపోత్సవం, 7 వ తేదీ గురువారం వసంతోత్సవం, స్నాపన తిరుమంజనం, ధ్వజ అవరోహణం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగయనున్నదన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శివరాజ్ మృతి

◆ **నివాళులు అర్పించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి**

బైరెడ్డిపల్లి, ఏప్రిల్17 (జన సంఘర్షణ )



బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు శివరాజ్ ఈ నెల 14వ తేదీన బైక్ లో వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో బోలోరే వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయన మరణవార్త తెలుసుకొని ఆయన పార్తివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటుమండల కో కన్వీనర్ కార్తీక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్వేటినగరం ఏప్రిల్ 17 (జన సంఘర్షణ ):



కార్వేటినగరంలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు పెరుగు తేనె హరిద్రవం చందనం పసుపుతో కూడిన అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి మొదలియార్ పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
18 ఏప్రిల్ 2026


# సజావుగా మంచినీటి సరఫరా జరిగేలా చూడాలి

**అధికారులకు వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు**



చిల్కానగర్ / జన సంఘర్షణ :
చిల్కానగర్ డివిజన్‌లో ప్రజలకు సజావుగా మంచి నీటి సరఫరా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని చిల్కా నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అధికారులను కోరారు. ఈ మేరకు ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిల్కానగర్ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారి చిల్కానగర్ డివిజన్ పరిధిలో నీటి సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అక్కిటి ఆగం రెడ్డి, మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొంపల్లి బాలరాజు, నల్లవల్లి మహేందర్, నారోజు రాధాకృష్ణ, సోను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# చైత్ర మాస అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు







ఉప్పల్ / జన సంఘర్షణ
ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయంలో చైత్ర మాస అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పోజి బలవంత చారి, బిక్షపతి, రాజగోపాల చారి, శ్రీను, పవన్, చోల్లేటి శ్రీనివాస్, శ్రీధర చారి, పాలేర్ల గోపి, పాలకూర్ల దిలీప్, తీగ విట్టల్ రావు, నర్సింగ్ రావు, ప్రభు ధాత్, శామీర్‌పేట హనుమంత్ రెడ్డి, బజార్ జగనాథ్ గౌడ్, కృష్ణారెడ్డి, గొంది ప్రశాంత్ రెడ్డి, జగన్, నర్సింహారెడ్డి, అభిరామ్, నవీన్, ముడుగొండ రావి, ప్రవీణ్ రెడ్డి, కొత్తకొండ రమేష్, తురాయి దాస్, మహేష్, రామ్ ప్రకాష్, గోపిచారి, పసుపునేటి రమేష్, వెంకటయ్య, కుమార్, భాస్కర్, నవీన్ గౌడ్, రాజు, సందీప్, మహేష్ కుమార్, ప్రశాంత్ కుమార్, పవన్ కుమార్, భవానీ శంకర్, లక్ష్మణ్, సంతోష్ కుమార్, బంటి, శ్రీనివాస్ గౌడ్, గణేష్ గౌడ్, యది గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**స్వతంత్ర భారత వనిలో దళితులపై ఆగని అకృత్యాలు**

**ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్**


**వరంగల్ లో అట్టహాసంగా ప్రారంభమైన డి.హెచ్.పి.ఎస్ రెండవ రాష్ట్ర మహాసభలు**






వరంగల్/ జన సంఘర్షణ:
బీజేపీ పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం ఉందని, స్వతంత్ర భారత వనిలో దళితులపై అకృత్యాలు ఆగడం లేదని ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్ అన్నారు. శుక్రవారం నాడు వరంగల్ నగరంలో దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) రెండవ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ మహాసభ బహిరంగ సభ సందర్భంగా వరంగల్ ఇస్లామీయా గ్రౌండ్ నుండి పోచం మైదాన్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బందేల నర్సయ్య హాల్ లో రాష్ట్ర అధ్యక్షుడు ఏసు రత్నం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభ ముఖ్య అతిథులుగా ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలనరసింహ లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ. రామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి వి ఎస్ నిర్మల్ మాట్లాడుతూ 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో నేటికీ దళితులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి, కుల నిర్మూలన కాగితాలకు పరిమితమైనదని అన్నారు. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రూపుదిద్దుకుందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, రాజ్యాంగ పునాదులుగా ప్రతిపాదించారని అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ సంస్థలు బలహీనపరచబడుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. దళిత, బలహీనవర్గాల హక్కుల కొరకు అభివృద్ధికి రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు గత కొన్ని సంవత్సరాలుగా పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలు మరియు ప్రైవేటీకరణ విధానాల వలన రోజురోజుకు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, కులవివక్ష, భూమి సమస్యలు, విద్యా హక్కుల వంటి ఘటనలు రాజ్యాంగ ఆత్మకు విరుద్ధంగా జరుగుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణ కేవలం న్యాయపరమైన అంశం కాదని, అది సామాజిక ఉద్యమం, దళితులపై జరిగే ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడటమే, దళితుల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) ప్రధాన లక్ష్యమని అన్నారు. అదేవిధంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలనరసింహ లు మాట్లాడుతూ సామాజిక న్యాయం అంటే వనరుల సమాన పంపిణీ, విద్య, ఉపాధిలో సమాన భాగస్వామ్యం, గౌరవప్రద జీవన హక్కు అని, ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై అగ్రకుల పెత్తందారుల దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాని, భూమి ఆక్రమణలు, సామాజిక బహిష్కరణలు, అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితుల్లో సామాజిక న్యాయం సాధన కోసం బలమైన సంఘటిత ఉద్యమం అవసరం అన్నారు. దళిత బడ్జెట్ కేటాయింపులు పూర్తి స్థాయిలో ఖర్చు కావడం లేదు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతోందన్నారు. దాంతో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయని, ఈ పరిస్థితిలో ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం అత్యవసరమని అన్నారు పెద్ద కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థల్లో సామాజిక న్యాయం సూత్రం అమలు కావాలని, దళిత యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి హామీ ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రభుత్వాలు స్పష్టమైన విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ బహిరంగ సభలో డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్కే బాషుమియా, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర నాయకులు మేకల రవి, పంజాల రమేష్, తోట బిక్షపతి, డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, సలిగంటి శ్రీనివాస్, టి.రామకృష్ణ, పి. లావణ్య, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఆరుట్ల రాజ్ కుమార్, కే. రాజ రత్నం, కే రత్నకుమారి, వై ఉషశ్రీ, బి.లక్ష్మీ జేరుపోతుల కుమారస్వామి, కే.వెంకటస్వామి, దేవి పోషన్న తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో రేపు భవ్య హిందూ సమ్మేళనం




రామంతాపూర్ / జన సంఘర్షణ :
హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన రామంతాపూర్‌లోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో భవ్యమైన హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శ్రీ భువనేశ్వరి పీఠాధీశ్వరులు, గన్నవరం శ్రీ చిదానంద ఆశ్రమానికి చెందిన శ్రీ శ్రీ శ్రీ కమలనంద భారతి స్వామిజీ హాజరై అనుగ్రహ భాషణం చేయనున్నారు. అలాగే వక్తలుగా తెలంగాణ స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత మహిళా ప్రముఖ్ డాక్టర్ కళ్ళెం స్వప్న, ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యాకారిణి సభ్యులు మాననీయ భాగయ్య పాల్గొని హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి, జాతీయ భావనలపై ప్రసంగించ నున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, భారతనాట్యం, భారతీయ యుద్ధ విద్య కలరిపయట్టు, శాస్త్రీయ సంగీత గానము వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామంతాపూర్, మధురానగర్, శ్రీనివాసపురం, గణేష్ నగర్, పీఎస్ కాలనీ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమితి అధ్యక్షుడు ఒగిరాల రమేష్, ఉపాధ్యక్షులు జగదీశ్ చంద్రరావు, యదునందన ఆచార్య, జల్లి వెంకట్ రెడ్డి, బి. మల్లేశం, లక్ష్మణ్ దాస్, ప్రధాన కార్యదర్శి రమేశ్వర్ రావు, సంఘటన కార్యదర్శి కామరాజు అరుణ, సంయుక్త కార్యదర్శులు తిండేరు భార్గవి, సోమ శ్రీనివాస్, ఒగిరాల సాయిరామ్, బాలరాజ్ యాదవ్, అనిల్ కుమార్, శేష రెడ్డి, నవీన్ పటేల్, కోశాధికారి బవిరిశెట్టి రమేష్ తదితరులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

# పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**



పెద్దపల్లి,ఏప్రిల్ 17 జన సంఘర్షణ:-
ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియా డిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో భాగంగా రామగిరి మండలంలోని ఆదివారంపేట,రాజాపూర్ గ్రామాల్లో గణాంక శాఖ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. కరీం నగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వేను నిర్వహిం చారు. జాతీయ గణాంక శాఖ 2026 సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై ఈ సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గ్రామాలు,పట్టణాలను ఎంపిక చేసి మొదట సాధారణ వివరాలను సేకరించి,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి సర్వే నిర్వహించి వివరాలను నమోదు చేస్తా మని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి విద్యార్హతలు,చదువు మాని వేత,ఉన్నత చదువులు, వృత్తి విద్య కోర్సులు,ఉద్యోగం, స్వయం ఉపాధి వంటి వివరాలు సేకరిస్తారు. రోజువారి కూలీల విషయంలో వారంలో చేసిన పని, పనిచేసిన గంట లు,పొందిన వేతనం వంటి వివరాలు నమోదు చేస్తారు. మహిళల స్వయం ఉపాధి సంబంధిత ఆదాయ వివరాలను కూడా సేకరిస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఇల్లం దుల సం జీవ్,పుల్లెల భాగ్యలక్ష్మి, కొము రయ్య, పంచాయతీ సెక్రటరీలు మెండే వేణు గోపాల్,దాసరపు కిరణ్, ఆశా వర్క ర్లు కాదాసి స్వప్న, సంధ్య,అంగన్వాడీ టీచర్లు ఇల్లందుల లలిత,కారోబార్ పరశురాములు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co